

# ఇ-మెయిల్ ఐడి

**- మల్లాది వెంకటకృష్ణమూర్తి**

ఇ-మెయిల్ ఐడి లేనివారు నేడు అరుదు. కానీ కొన్నేళ్ల క్రితం మైక్రోసాఫ్ట్ హాట్‌మెయిల్‌ని మొదలెట్టిన కాలంలో జరిగిన సంఘటన ఇది.

ఆట్టే చదువుకోని జేమ్స్ మేక్రాన్ అనే నిరుద్యోగి కాలిఫోర్నియాలోని మైక్రోసాఫ్ట్ ఆఫీసులో ఊడ్చే పని వాడి పోస్ట్ ఖాళీగా ఉందని తెలుసుకుని, దాని కోసం అప్లికేషన్ పెట్టుకున్నాడు. మేనేజర్ అతన్ని పిలిపించి ఆప్టిట్యూడ్ టెస్ట్ పెట్టాడు. అందులో జేమ్స్ ఉత్తీర్ణుడవడంతో మేనేజర్ అతనితో చెప్పాడు.

''నిన్ను సెలెక్ట్ చేసుకున్నాం. రోజుకి 30 డాలర్ల స్కేల్‌తో నిన్ను అపాయింట్ చేసుకుంటాం. నువ్వు నింపాల్సిన ఫారాన్ని ఎక్కడ ఎప్పుడు ఎవరికి రిపోర్ట్ చేయాలో తెలియజేస్తాను. నీ ఇ-మెయిల్ అడ్రస్ ఇచ్చి వెళ్ళు''

జేమ్స్ వెంటనే చెప్పాడు.

''నాకు కంప్యూటర్ లేదు. ఇ-మెయిల్ అడ్రస్ అంతకంటే లేదు''

''అలాగా? అయితే మాకు సంబంధించినంత వరకూ నువ్వు లేనట్లే లెక్క. అందువల్ల నిన్ను ఉద్యోగంలో నియమించుకోలేం''

ఆ జవాబుకి జేమ్స్ నివ్వెరపోయాడు.

అతని దగ్గర 10 డాలర్లు మాత్రమే ఉన్నాయి. ఏం చేయాలో తోచక జేమ్స్ సూపర్‌మార్కెట్‌కి వెళ్లి వాటితో పదికిలోల ఏపిల్ పళ్ళు కొన్నాడు. వాటిని హైవే దగ్గరికి తీసుకెళ్ళి రెండుగంటల్లో వాటిని వందశాతం లాభానికి అమ్మాడు. ఆ రోజు ఆ వ్యాపారాన్ని కొనసాగించి రాత్రికల్లా దాదాపు వందడాలర్ల లాభాన్ని ఆర్జించాడు.

ఆపిల్‌పళ్ళని అమ్మి తను హాయిగా జీవించగలనని గ్రహించాడు.

రోజూ తెల్లవారుజామునే నిద్రలేచి అర్ధరాత్రి దాకా మేలుకుని కొద్దివారాల్లోనే జేమ్స్ ఆ వ్యాపారంలో చాలా సంపాదించాడు.

తర్వాత కొన్ని డజన్ల ఏపిల్ పళ్ల కార్టన్లని రవాణా చేయడానికి ఓ చిన్న తోపుడు బండిని కొన్నాడు. వ్యాపారం ఆరంభించిన మొదటి ఏడాది చివరికి ఓ పికప్ ట్రక్‌ని కొనగలిగాడు.

ఐదేళ్లల్లో అతనికి డజను పికప్ ట్రక్కులు, తన కింద పనిచేసే వందమంది నిరుద్యోగులు ఏర్పడి, నిత్యం టన్నులకొద్దీ ఏపిల్స్‌ని హైవేలో కార్లలో వెళ్ళేవాళ్లకి అమ్మసాగాడు.

ఇక జీవితంలో సెటిల్ అవాలనుకున్నాడు జేమ్స్. తన దగ్గర పని చేసే మిస్ అన్నేని వివాహం చేసుకున్నాడు. ఆమె గర్భవతి అయ్యాక తనవాళ్ళ భవిష్యత్తు కోసం లైఫ్ ఇన్సూరెన్స్ చేయాలనుకున్నాడు. ఓ ఇన్స్యూరెన్స్ కంపెనీకి ఫోన్ చేస్తే ఏజెంట్ వచ్చి అతని ఆదాయం గురించి విచారించి, అతనికి సరిపడే ఇన్స్యూరెన్స్ ప్లాన్ వివరాలని లాప్‌టాప్‌లో ప్రదర్శించాడు.

జేమ్స్‌కి అది నచ్చడంతో ఆ ప్లాన్‌లో చేరాలనుకున్నాడు. మొదటి ప్రీమియం చెక్ రాసిచ్చాక రిప్రజెంటేటివ్ చెప్పాడు.

''ప్రతీ మూడునెలలకీ మీరు ప్రీమియంని చెల్లిస్తుండాలి. మీ ఇ-మెయిల్ అడ్రస్ ఇస్తే వారం ముందే మీకు రిమైండర్‌ని పంపుతుంటాం''

''నాకు ఇ-మెయిల్ అడ్రస్ లేదు. అసలు కంప్యూటరే లేదు''

జేమ్స్ సమాధానానికి అతను ఆశ్చర్యపోయాడు.

''ఇంతదాకా మీకు ఇ-మెయిల్ అడ్రస్ లేదా? ఇంటర్నెట్, ఇ-మెయిల్ ఐడి, ఇ-కామర్స్ లేకుండా ఇంత డబ్బు ఎలా సంపాదించగలిగారు?'' విస్మయంగా అడిగాడు.

జేమ్స్ బదులుగా భుజాలు రెండూ ఎగరేశాడు.

''మీకు మొదటినించీ ఇ-మెయిల్ ఐడి ఉండి ఉంటే మీరు ఇప్పుడు ఎక్కడ ఉండేవాళ్ళో ఊహించలేరు'' చెప్పాడు రిప్రజెంటేటివ్.

''ఊహించగలను. మైక్రోసాఫ్ట్ ఆఫీస్‌లో స్వీపర్ ఉద్యోగంలో ఉండేవాడిని'' జవాబు చెప్పాడు జేమ్స్.


## కొత్త సీరియల్ వచ్చేవారమే ప్రారంభం!

అందరికీ రంగులతో మెరుపులతో కనిపించే
జీవితాలలో నిజంగా మెరుపులు వుంటాయా?
తెరమీద రకరకాల పాత్రలలో జీవించేవాళ్ల
గ్రీన్‌రూమ్ బతుకులు ఎట్లా వుంటాయి?
నటనకు నిజానికి మధ్య ఎంత దూరం!

**గ్లామర్ లైఫ్‌లో వుండే చేదు నిజాలకు దర్పణం**

# రాత్రిపూట

రచన : సి. సుజాత